క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పటాన్‌చెరు టౌన్: కరాటే పోటీల్లో పటాన్‌చెరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం హైదరాబాద్, మేడ్చల్ సుమంగళి గార్డెన్‌లో జరిగిన 3వ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే ఛాంపియన్ షిప్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఆరుగురు స్వర్ణ పతకాలు సాధించగా, మరో ఇద్దరు కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌శంకర్ సోమవారం తెలిపారు. విద్యార్థులు, కరాటే కోచ్ కొమురయ్యను స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకుల బృందం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం రాజగోపాల్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే డబ్బులు చెల్లించండి


మెడికల్ అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు


నారాయణఖేడ్: లెప్రసీ సర్వేకు సంబంధించిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్ విజ్ఞప్తి చేశారు. నిజాంపేట్ పీహెచ్‌సీ పరిధిలోని ఆశావర్కర్లతో కలిసి పీహెచ్‌సీ మెడికల్ అధికారిణి తరణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి లెప్రసీ, పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ పాత బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ఆశా వర్కర్లు జమున బాయి, ప్రేమలత, రుక్మిణి, జ్యోతి, సాయమ్మ పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇవ్వండి


నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

కంది(సంగారెడ్డి): గత ప్రభుత్వం హెచ్ఎండీఏ పేరుతో తీసుకున్న తమ భూములను తిరిగి ఇవ్వాలని బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కందిలోని సర్వే నంబర్ 656లో ఉన్న అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న తమకు పరిహారం ఇస్తామని చెప్పి అధికారులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. జీవనాధారమైన భూములను ప్రభుత్వం తీసుకోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి భూములను తిరిగి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు. కె.జగన్, జిల్లా అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, కార్యదర్శి సురేష్, రైతులు భిక్షపతి, శ్రీనివాస్, దుర్గయ్య, జంగయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పూడికతీత పనులు ప్రారంభిస్తున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్‌కాలనీలో నాలాలో పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొనిపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. లింగంపల్లి నుంచి ఇసుక బావి వరకు నాలాలోని చెత్తను తొలగించనున్నట్లు తెలిపారు. ప్రజలు నాలాలో చెత్త వేయొద్దని సూచించారు.

టైలరింగ్‌పై మహిళా సంఘాలకు శిక్షణ

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాల సభ్యులకు టైలరింగ్‌పై శిక్షణ నిర్వహించారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగం పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని ఝరాసంగం తో పాటు రాయికోడ్, న్యాల్ కల్ మండలాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లే మొక్కలకు రక్ష

- 38 నర్సరీల్లో మొక్కల రక్షణకు పందిళ్లు ఏర్పాటు
- ఎండ నుంచి కాపాడేందుకు చర్యలు


నర్సరీలోని మొక్కలకు చలువ పందిళ్లు

హత్నూర (సంగారెడ్డి): ఎండలు మండుతుండడంతో నర్సరీలో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నర్సరీల్లో చలువ పందిళ్లు (షెడ్ నెట్) ఏర్పాటు చేశారు.

చలువ పందిళ్ల ఏర్పాటు ఇలా..

వన మహోత్సవంలో భాగంగా హత్నూర మండలంలోని 38 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకంగా ఒక్కో నర్సరీని ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 3000 కొత్త మొక్కలను పెంచుతుండగా గత సంవత్సరానికి సంబంధించిన మొక్కలు సైతం ఇందులో వనసేవక్ ఆధ్వర్యంలో పెంచుతున్నారు. కొత్తవి పాతవి కలిసి ఒక్కో నర్సరీలో సుమారు 6000 వరకు మొక్కలు పెరుగుతున్నాయి. ఒక్కో నర్సరీ ప్రారంభం నుంచి పూర్తి గా మొక్కలు పెరిగే వరకు ఏడాదికి రూ.1,45,000 నిధులను అధికారులు ఖర్చు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా రెండు లక్షల 2 వేల 28 మొక్కలు పెంచుతున్నారు. అయితే, ప్రస్తుతం పెంచుతున్న మొక్కలు ఎండలకు మొక్కలు దెబ్బతినకుండా నర్సరీల చుట్టూ ప్రత్యేక స్తంభాలను ఏర్పాటు చేసి పైన చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ చలువ పందిళ్ల ఏర్పాటుకు గ్రామపంచాయతీ నుంచి గ్రీన్ నిధుల కింద ఏడు నుంచి పదివేల వరకు ఖర్చు చేసి పందిళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉ.7 నుంచే సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో నర్సరీ నిర్వాహకులు వన సేవక్ ఉ. 9 గంటల లోపే నీళ్లు మొక్కలకు పడుతున్నారు.

నర్సరీల బాధ్యత కార్యదర్శులదే..

గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీ నిర్వహణ బాధ్యతలను ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి అధికారులు అప్పగించారు. ప్రతి వనం నర్సరీలో నీటి కోసం బోరును ఏర్పాటు వేశారు. పెంచుతున్న మొక్కలను వన సేవక్ ద్వారా రోజు నీటిని పట్టిస్తూ మొక్కలు ఎండిపోకుండా చూడాల్సి ఉంది. ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం నర్సరీల మొక్కల పెంపకం బాధ్యత తీసుకొని సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు. నర్సరీల నిర్వహణపై ప్రతిరోజు జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీఓ, ఎంపీఓ ఈజీఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాం



మండలంలోని 38 గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రస్తుత వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయి.. పెంచిన ప్రతి మొక్కను కాపాడాలని ఉద్దేశంతో చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కను కాపాడుకుంటాం.

–ప్రవీణ్ కుమార్, ఏపీఓ

సీఎంకు స్వాగతం పలికిన కలెక్టర్, ఐజీ


సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడి కుమారుడు వివాహ విందుకు సోమవారం సాయంత్రం హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐజీ సత్యనారాయణ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎంతో వెళ్లి నూతన వధూవరులను కలెక్టర్ క్రాంతి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పారితోష్ పంకజ్‌లు ఆశీర్వదించారు.

బ్యాంకుల్లో ఉర్దూ సైన్‌బోర్డులు ఏర్పాటుకు వినతి


డీజీఎంకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

జహీరాబాద్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బ్యాంకుల్లో ఉర్దూభాష సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్‌కుమార్‌కు ముస్లిం సంఘాల నాయకులు విన్నవించారు. సోమవారం ఆయన జహీరాబాద్ వచ్చిన సందర్భంగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైఫుద్దీన్‌గోరి, మైనార్టీ కమిషన్ మాజీ సభ్యుడు సద్రుద్దీన్‌గోరి కలిసి వినతి పత్రం అందజేశారు. జహీరాబాద్‌లో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్నందున ఈ మేరకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఉర్దూ సైన్ బోర్డులు లేకపోవడంతో ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ప్రదీప్‌మిశ్రా, అసిస్టెంట్ మేనేజర్ శివారెడ్డి ఉన్నారు.

ఆకట్టుకున్న సంగీత్ దర్బార్


నృత్యాలు చేస్తున్న సభ్యులు, భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నిర్వహించిన సంగీత్ దర్బార్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. దత్తగిరి వార్షిక అమరతిథిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి గాయని రేలారే రేలా గంగా పాడిన పాటలు అలరించాయి. రేలారే గంగా బృందం సభ్యులు ఫోక్ సింగర్స్ జంగిరెడ్డి, సునీత, మల్లంపల్లి రాజు నిర్వహించిన భక్తి, జానపద గీతాలతో ఉర్రూతలూగించారు. భక్తిపాటలతో దత్తగిరి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన సంగీత దర్బార్ సోమవారం ఉ. 6 గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు తడోలా రాజేశ్వర శివాచార్య స్వామిజీ, బీచ్కుంద సోమయప్పస్వామి, పంచవటి కాశీనాథ్‌బాబా, తంగేడుపల్లి శివయోగి శివాచార్య, విశ్వగిరి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట


రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పొలంబాట కార్యక్రమానికి హాజరయ్యారు. మండలంలోని నల్తూరు, కొర్రకుంట, కిష్టయ్యపల్లి గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటర్లు అమర్చుకోవాలని తద్వారా బోరు మోటార్లు కాలిపోవని చెప్పారు. రైతులు క్షేత్రస్థాయిలో ఏమైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే సిబ్బందికి లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు విద్యుత్ సిబ్బంది స్నేహపూర్వకమైన సేవలను అందించేందుకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, లైన్‌మేన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పడిన చెట్టు తొలగింపు

సాక్షి స్పందన

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామ సమీపంలో చెట్టు విరిగి నాందేడ్- అకోలా జాతీయ రహదారిపై అడ్డంగా పడడంతో ఈనెల 15న 'రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్టు' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురించారు. దీంతో స్పందించిన హైవే అధికారులు ఆ చెట్టును తొలగించారు. దీంతో వాహనదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సాక్షి కథనంపై కృతజ్ఞతలు తెలియజేశారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

టమాటా సాగుపై అవగాహన

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో సోమవారం కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు స్టాగర్డ్ పద్ధతిలో టమాట సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు మార్కెట్‌లో ధరలేక పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. దీనిని అధిగమించేందుకు ఈ విధానంలో సాగు చేసుకున్నట్లయితే పంట దశలవారీగా చేతికి వచ్చి లబ్ధి పొందవచ్చని తెలిపారు. నాలుగు పర్యాయాలు పక్షం రోజుల గ్యాప్‌తో నాటు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థులు వర్ష, మానస, యామిని, రైతులు సంజీవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రామకృష్ణ, అంజన్న, బాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి


అవగాహన కల్పిస్తున్న రంజిత్‌రెడ్డి

నారాయణఖేడ్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం, ఎయిడ్స్ నియంత్రణ సంఘం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్‌కు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడం, నివారించడం, పరిష్కరించడంలో ఎయిడ్స్ విద్య ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా గుర్తించారని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఐసీటీసీ సమన్వయకర్త నర్సింహా,కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, యువజన సంఘాల నాయకులు అనిల్‌రెడ్డి, చంద్రశేఖర్, దశరథ్, గోపాల్, రవి, సచిన్, నర్సింహులు, అరవింద్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి మృతి



పుల్‌కల్(అందోల్): మిన్‌పూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు పటోళ్ల విఠల్‌రెడ్డి అనారోగ్యంతో మరణించారు. అంత్యక్రియలు స్వగ్రామం మిన్‌పూర్‌లో సోమవారం నిర్వహించారు. విఠల్‌రెడ్డి మృతిపై మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుర్గయ్య సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు.

ధర్నా.. వినతులు

ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ధర్నాలు, నిరసనలు నిర్వహించారు. అనంతరం ఆయా రెవెన్యూ కార్యాలయాల్లోని తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వేతనం పెంపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చని పక్షంలో రాబోయే రోజుల్లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


వట్‌పల్లి (అందోల్) : తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశాలు


జోగిపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


కొండాపూర్: తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

డంపింగ్‌యార్డ్ ఏర్పాటును విరమించుకోండి

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌కు ప్యారానగర్ గ్రామస్తుల వినతి


రఘు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసనలు 41 రోజులకు చేరాయి. గుమ్మడిదల, ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి. నిరాహార దీక్షలకు రోజురోజుకు స్థానికంగా మద్దతు పెరుగుతోంది. రైతులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారస్తులు అని తేడా లేకుండా ప్రతీ ఒక్కరు రిలే నిరాహార దీక్షల్లో భాగస్వామ్యమవుతున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు ప్రజలు సోమవారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌ను కలిసి డంపింగ్‌యార్డ్ ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని స్థానిక ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటును విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విరమించే వరకు జేఏసీ తరఫున పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సురేష్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి జాతీయ రహదారి, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

25 మందికి..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐలాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 25 మందిని అదుపులోకి తీసుకొని జరిమానా విధించారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు


అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

నారాయణఖేడ్: అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని చలో హైదరాబాద్‌కు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తరలివెళ్తున్న పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నారాయణఖేడ్ సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వరాచారి, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, పార్శెటి సంగప్ప, జైపాల్‌రెడ్డిలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ప్రభుత్వం తాము చేపట్టి న పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని, అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణ చట్టాన్ని ఆమోదించాలి


జహీరాబాద్: రిలే నిరాహార దీక్షలో నాయకులు

జహీరాబాద్: ఎస్సీవర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించి అమలులోకి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్‌లో చేపట్టిన రిలే దీక్షలు ఐదవ రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు వర్గీకరణ వర్తింపజేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన విషయమన్నారు. వర్గీకరణ అమలులోకి తీసుకురాకుంటే ఉద్యోగాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతుందనే విషయం సీఎంకు కూడా తెలుసన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైఖల్, రమేష్, అబ్రహం మాదిగ, ఉల్లాస్ మాదిగ, తరుణ్ పాల్గొన్నారు.

పక్కాగా రిజర్వేషన్లు అమలు చేయాలి

నారాయణఖేడ్: ప్రభుత్వం రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని తెలంగాణ పోలీస్ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. ఖేడ్ తహశీల్ గ్రౌండ్‌లో ఎస్సీల వర్గీకరణ చట్టం చేశాకే ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలను వెల్లడించాలన్నారు. ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనాభా ప్రాతిపదికన మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం ఏడవ రోజూ కొనసాగింది.

సంక్షిప్త వార్తలు

◆ అక్రమ నిర్మాణంపై కొరడా


నిర్మాణాన్ని నేలమట్టం చేసిన ఆర్ఐ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని కాజీపల్లి గ్రామ శివారు జర్నలిస్టు కాలనీలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పోతులబోగుడా ఉన్నత పాఠశాలలో సోమవారం వట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు పరీక్ష ప్యాడులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించడానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులను అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోయినొద్దీన్, సభ్యుడు పెద్దన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ హాస్టల్‌కు సిబ్బందికి దరఖాస్తులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని మోడల్ పాఠశాలలో నూతనంగా ప్రారంభించే హాస్టల్‌లో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయడానికి నోటిఫికేషన్ జారీ చేశామని ఎంఈఓ శంకర్ తెలిపారు. అటెండర్, వాచ్ ఉమెన్, కుక్ పదో తరగతి విద్యార్హత కలిగిన వారు, ఎఎన్ఎంకు ఇంటర్ అర్హతతో పాటు ట్రైనింగ్ సర్టిఫికేట్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, కేర్‌టేకర్ తదితర ఖాళీలను భర్తీ చేయడానికి అర్హత గత అభ్యర్థులు కేజీబీవీ ఎస్ఓకు దరఖాస్తును అందజేయాలని ఎంఈఓ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

వట్‌పల్లి(అందోల్): చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అందోల్ మండలంలోని డాకూర్ గ్రామ శివారులో తాలేల్మ రాజేందర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఇంటింటికి భద్రాచలం తలంబ్రాలు

సంగారెడ్డి టౌన్ : భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంలోని తలంబ్రాలను ఇంటింటికి చేర్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 6 వరకు సమీప ఆర్టీసీ డిపోల్లో బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఒక ప్యాకెట్‌కు రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గాయత్రీదేవిగా భవాని మాత



సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేటలో నిర్వహిస్తున్న దుర్గాభవాని ఆలయ 24వ వార్షికోత్సవాలు రెండవ రోజూ ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవారు సోమవారం గాయత్రిమాతగా భక్తులకు దర్శనమిచ్చింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చతుర్వేద స్వాహాకారం, సహస్ర లింగార్చన వంటి క్రతువులను నిర్వహించారు. అఖండ నామస్మరణ, అఖండ భజన, వేద మంత్ర ఘోషలు, భక్తుల అమ్మవారి నామస్మరణలతో ఆధ్యాత్మిక సందడి కనిపించింది. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలోని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు.